ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

శుక్రవారం 8 మార్చి 2024







కోటప్పకొండకు తరలివెళ్తున్న అమీన్‌సాహెబ్ పాలెం ప్రభలు

మహాశివరాత్రి.. మహోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో.. అంటూ భక్తులు శివయ్య దర్శనాలకు సిద్ధమయ్యారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు కాంతులీనుతున్నాయి. స్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలకు కూడా ఏర్పాట్లు జరిగాయి. కోటప్పకొండ, వడ్లమూడి క్వారీ, గోవాడ క్షేత్రాలకు ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయల్దేరాయి. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ల శుక్రవారం నేత్రపర్వంగా జరగనుంది. వడ్లమూడి, గోవాడ క్షేత్రాల్లోని బాలకోటేశ్వరస్వామి ఆలయాల చుట్టూ పశువులు, జీవాలను తిప్పి కాపరులు మొక్కులు తీర్చుకున్నారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవానికి కాకాని మల్లన్న సన్నిధిని ముస్తాబు చేశారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. శైవక్షేత్రాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు జరిగాయి.



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న కోటప్పకొండ ఆలయం

ప్రత్యేక అలంకరణలో శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్



కోటప్పకొండ తిరునాళ్ళకు తరలివస్తున్న భారీ విద్యుత్ ప్రభలు



విద్యుత్ కాంతు లీనుతున్న అమరేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం

చేదుకో.. కోటయ్యా

నేడు మహాశివరాత్రి

- విద్యుత్ వెలుగుల్లో శైవక్షేత్రాలు
- తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబు
- బాలకోటేశ్వరస్వామి దర్శనాలకు భక్తుల క్యూ
- నేటి రాత్రి మల్లన్న, అమరేశ్వరుని కల్యాణోత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 7: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్య స్వామికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దేవాలయంలో ఏర్పాట్లను ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్ల నుంచి 528 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సేవలు అందించేందుకు స్కౌట్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు కొండకు తరలి వచ్చారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం నుంచి ఒక్కొక్క ప్రభ కొండకు గురువారం బయల్దేరింది. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని నుంచి రెండు ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. భారీ ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేయనున్నారు.


వీఐపీలకు పెద్దపీట..

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్దపీట వేస్తున్నారు. కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలు ఉచితంగా అందించనున్నారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తోంది. ఆర్టీసీ కూడా వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసి వారి సేవకు సిద్ధమవగా, సామాన్య భక్తులను నుంచి ముక్కుపిండి అధిక చార్జీలను వసూలు చేస్తోంది.

అమరేశ్వరుని గ్రామోత్సవం

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం పులివాహనం, పల్లకిపై కన్నుల పండువగా జరిగింది. ఉదయం మండప పూజ, నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జరిగే స్వామివారి దర్శనం, అభిషేకాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు లింగోద్భవకాల అభిషేకాలు, ఎదురుకోల ఉత్సవం, ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం జరుగుతుంది.

క్వారీలో ప్రత్యేక పూజలు



క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన నారా కోడూరు విద్యుత్‌ప్రభ, ఇన్‌సెట్లో పూజలందు కొంటున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి



చేబ్రోలు: వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో గురువారమే తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానరహదారిపై ఆలయం ఉండటంతో తెనాలి, గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌ను పలు మార్గాల్లో మళ్లించారు.

దేదీప్యమానంగా మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలకు పెదకాకాని మల్లన్న సన్నిధిని సర్వంసిద్ధం చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో శోభయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం కోసం శీఘ్ర, లఘు, ఉచిత దర్శనాలకు అవసరమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణానికి ముస్తాబు చేశారు. ఏర్పాట్లను డీసీ దాసరి శ్రీరామవరప్రసాద్ పర్యవేక్షించారు.



విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధి



గోవాడ ఆలయ విద్యుత్ ప్రభ



విద్యుత్ అలంకరణలో ఆలయ రాజగోపురం

ఉత్సవాలు ప్రారంభం

అమృతలూరు, మార్చి 7: అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల దర్శనానికి సన్నద్ధం చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు నిర్మించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కులను భక్తులు చెల్లించారు. డీసీ బొంతు మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మురళీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగడం విశేషం. తెనాలి, బాపట్ల, రేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ సత్రాల్లో అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పెదకాకాని ఆలయం లోపల ప్రత్యేక విద్యుత్ కాంతులు



పెమ్మసాని, నాదెండ్లకు బ్రహ్మరథం

- నేతలకు స్వాగత హారతులు, పూలవర్షం
- తెలుగు జనచైతన్య పాదయాత్ర పేరుతో ప్రచారం





భారీ గజమాలలతో మనోహర్, చంద్రశేఖర్, రాజాలకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

తెనాలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన జెండాల రెపరెపలు.. కిక్కిరిసిన జనం, మహిళల స్వాగత హారతులు, పూలవర్షం మధ్య ఉమ్మడి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ గురువారం తెనాలిలో ప్రచారం ప్రారంభించారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు స్వరాజ్ టాకీసు సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు చేసిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. టీడీపీ, జనసేన బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలుగు జనచైతన్య పాదయాత్ర పేరుతో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆయనతో పాటు పెమ్మసాని కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. తెలుత బోస్‌రోడ్‌పై ఉన్న దేశ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి యాత్రను కొనసాగించారు. 2 కి.మీటర్లలోపున్న దూరాన్ని మూడుగంటలకుపైగా పట్టింది. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత మనోహర్, పెమ్మసానిలు ముందుకు సాగుతుంటే, కన్యకాపరమేశ్వరి ఆలయం దగ్గర ఆర్యవైశ్య నాయకులు, అభిమానులు హారతులతో స్వాగతం పలికారు. మమత భవన్ దగ్గర న్యాయవాది హరిదాసు గౌరి, పసుపులేటి మురళిల ఆధ్వర్యంలో క్రేన్‌తో అభ్యర్థులకు భారీ గజమాలను వేసి అభిమానాన్ని చాటుకున్నారు. గాంధీచౌక్ దగ్గర వర్తక, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు వారికి ఘన స్వాగతం పలికారు. మార్వాడీ గుడి రోడ్డు దగ్గర మార్వాడీ ప్రముఖులు, మహిళలు నేతలకు హారతులిచ్చి దీవెనలందించారు.

రెండు నెలల్లో గుణపాఠం

పాదయాత్ర సందర్భంగా పెమ్మసాని, నాదెండ్ల మనోహర్‌లు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో సీఎం జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. రాష్ట్రంలో జరుగున్న ఘోరాలు, స్వలాభం కోసం తీసుకుంటున్న చెత్త నిర్ణయాలతో విసిగిపోయిన జనం టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారనేందుకు ఈ పాదయాత్రే నిదర్శనమన్నారు. రోడ్లపై గుంతలు పెట్టి, నాయకులతో బూతు పురాణాలు చదివించి, చివరకు మందుబాబులను కూడా వదలకుండా వీరబాదుడు బాదిన జగన్‌కు మళ్లీ చరిత్రలో కనిపించకుండా జనం బుద్ధి చెబుతారన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దోచుకోవడం, దాచుకోవడం, దాడులు చేయడం, హత్యలకు తెగబడటం తప్ప వైసీపీ మ్యానిఫెస్టోలో ఏమీ లేవన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు నన్నపనేని రాజకుమారి, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, అన్నాబత్తుని జయలక్ష్మి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, ఈదర పూర్ణచంద్, సూరపనేని నాగేశ్వరరావు, గాదె వెంకటేశ్వరరావు, హరిదాసు గౌరీశంకర్, పసుపులేటి మురళి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కూల్.. ఫుల్



- మిర్చి టిక్కీలు శీతల గిడ్డంగుల బాట
- ఇప్పటికే 65 శాతం నిండిన కోల్డ్‌స్టోరేజీలు
- చిన్నవి అయితే 100 శాతం నిండినట్లుగా బోర్డుల ఏర్పాటు
- మార్కెట్‌లో మిర్చి ధర తగ్గడమే మూలకారణం

4 లో..

అమరావతిపై వైసీపీ పాలకులకు అక్కసు

- 1542వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

కౌలు రైతు ఆత్మహత్య

దేవుడు.. యధార్థవంతుడు

- పాస్టర్ మోహన్ సీ లాజరస్
- ఘనంగా ప్రారంభమైన గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 7: దేవుడు న్యాయవంతుడు, యధార్థవంతుడు అని పాస్టర్ మోహన్ సీ లాజరస్ వ్యాఖ్యోపదేశం చేశారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. తమిళనాడు నుంచి వచ్చిన పాస్టర్లు మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్, హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రమేష్, ఫ్రైడిపాల్, రాజు పండుగను ప్రారంభించారు. మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్ గుడారాల పండుగకు వచ్చే ప్రతిఒక్కరూ భాగ్యవంతులు అని సందేశామిచ్చారు. 1977లో ప్రారంభమై నేడు లక్షాలాది మంది విశ్వాసుల ప్రేమకు గుడారాల పండుగ చేరువైందన్నారు. అంతకముందు అమెరికా నుంచి వచ్చిన ఫాదర్ ఎర్నిస్ట్ పాల్ 'నిత్యతేజుడు ఏసయ్య' అనే పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. 'నిత్యతేజుడు ఏసయ్య' అనే అల్బమ్‌ను మదనపల్లి నుంచి వచ్చిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తున్న అబ్రహం, జాన్‌వెస్లీ, రాజు, ఫ్రైడిపాల్, రమేష్, గుడారాల పండుగకు హాజరైన విశ్వాసులు



నేడు గుంటూరు - తెనాలి మార్గంలో
ట్రాఫిక్ మళ్లింపు

● వాహన చోదకులు సహకరించాలని ఎస్పీ వినతి

గుంటూరు, మార్చి 7 చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం వరకు తెనాలి - గుంటూరు మార్గంలో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు తెనాలి డీఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి రోజు శనివారం ఉదయం 6 గంటల వరకు వుంటుందన్నారు. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి.

- చేబ్రోలు - ముట్లూరు రోడ్‌లో: బాపట్ల, పొన్నూరు నుండి గుంటూరు వెళ్ళే వాహనాలను ముట్లూరు రోడ్డులోకి పంపించి, పాతరెడ్డిపాలెంలో ఉన్న లేమల్లెపాడు క్రాస్ రోడ్డు గుండా అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు.
- చేబ్రోలు లోని వడ్లమూడి అడ్డరోడ్డు నుంచి: బాపట్ల మరియు పొన్నూరు నుండి తెనాలి వెళ్ళే వాహనాలను చేబ్రోలు మసీద్ సెంటర్ లో ఉన్న వడ్లముడి అడ్డరోడ్డు గుండా, వడ్లమూడి గ్రామం గుండా తెనాలి వెళ్ళాలన్నారు. చేబ్రోలు ప్రజలు అనగా గుడికి వెళ్ళే వారు కూడా అదే రూట్ గుండా వెళ్ళాలన్నారు.
- వడ్లమూడి అడ్డరోడ్డు: తెనాలి నుండి పొన్నూరు వెళ్ళే వాహనాలను వడమూడి అడ్డరోడ్డు గుండా పొన్నూరు, చేబ్రోలు వెళ్ళాలన్నారు.
- తెనాలి ఫ్లై ఓవర్ : గుంటూరు కు వచ్చే బారి వాహనాలను నందివెలుగు రోడ్డు వైపు మళ్ళించామన్నారు. క్వారీ కి వచ్చేఆర్టీసీ బస్సులను మాత్రమే పంపాలన్నారు.
- బుడంపాడు ఫ్లైఓవర్ : గుంటూరు నుండి బాపట్ల పొన్నూరు వెళ్ళు వాహనాలను అనంతవరప్పాడు అడ్డరోడ్డు గుండా అనంతవరప్పాడు మరియు లేమల్లెపాడు గ్రామాలు మీదగా చేబ్రోలుకు వచ్చివెళ్ళాలన్నారు. గుంటూరు నుండి తెనాలి వెళ్ళు వాహనాలు నందివెలుగు రోడ్డు గుండా మాత్రమే వెళ్ళాలన్నారు. అదేవిధంగా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి గుడికి వచ్చు భక్తులకు త్రీ వీలర్, టు వీలర్ వాహనాలను మాత్రమే నారాకోడూరు వైపు అనుమతిస్తామన్నారు. కాగా ఆయా వహన చోదకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

సొంత గూటికి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ విజయ

● ఏపీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

గుంటూరు,మార్చి 7: గుంటూరు మాజీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కూచిపూడి విజయ తన కుమారుడు కృష్ణకాంత్‌తో కలిసి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో గురువారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా షర్మిల పార్టీ కండువాతో వారిని కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిం చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో కూచిపూడి సాంబశివరావుకు తొలి నుంచి మంచి స్నేహ సంబంధాలున్నాయి. 2004లో వైఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూచిపూడి సాంబశివరావు దంపతులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు.



నగదు చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ ట్రస్టీ పీ.ప్రతీష

శంకర నేత్రాలయానికి రూ.10లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి7 శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం లక్ష్మీపురంలో ఫౌండేషన్ ట్రస్టీ పి.పద్మాలక్ష్మీ ప్రతీష శ్రీ కంచి కామకోటి పీఠ మెడికల్ ట్రస్ట్‌కు చెక్కును ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పొట్టి సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో గత రెండు దశాబ్దాలకు పైగా వేలాదిమందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవరసమైతే శస్త్ర చికిత్సలు అందజేస్తున్నామని వివరించారు. భారీ విరాళాన్ని ఇచ్చి ఔదార్యత చాటుతున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి యూనిట్ హెడ్స్ సీహెచ్ త్రిపుర, ఎం.మాధవి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూల్.. ఫుల్

● మిర్చి టిక్కీలు శీతల గిడ్డంగుల బాట
● ఇప్పటికే 65 శాతం నిండిన కోల్డ్‌స్టోరేజ్‌లు
● చిన్నవి అయితే 100 శాతం నిండినట్లుగా బోర్డుల ఏర్పాటు
● మార్కెట్‌లో మిర్చి ధర తగ్గడమే మూలకారణం



కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసేందుకు లారీల్లో తరలిస్తున్న మిర్చి టిక్కీలు



గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర తగ్గడంతో రైతులు చేసేది లేక తమ పంటని శీతల గిడ్డంగులకు తరలించడం ప్రారం భించారు. ప్రస్తుతం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనసాగుతున్న మిర్చి ధరలకు అమ్మితే తాము పూర్తిగా నష్టపోతా మనే నిర్ణయానికి రైతులు వచ్చారు. మిర్చి టిక్కీకి రూ.210 కోల్డ్ స్టోరేజ్ ఛార్జీ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచన చేయకుండా వాటిల్లో నిల్వచేస్తున్నారు. మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు తీసుకొచ్చి విక్ర యించుకొందామని భావిస్తున్నారు. పెట్టుబడి అవసరమైన రైతులు మాత్రంచేసేది లేక మార్కెట్‌లో లభిస్తున్న ధరకే మిర్చి విక్రయిం చేస్తున్నారు. ఇటీవలకాలంలో ఎప్పుడూ లేనివిధంగా సీజన్ మధ్య లోనే సరుకు కోల్డ్‌స్టోరేజ్‌లకు చేరుకోవడం ఇప్పుడే చూస్తున్నామని రైతులు, మిర్చి వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ,బీ కేటిగిరీ కోల్డ్‌స్టోరేజ్‌లు 100శాతం నిండిపోయాయి. మిగతావాటిల్లో మాత్రం 65శాతం వరకు నిండుగా ఇంకా 35శాతం ఖాళీ ఉన్నట్లు కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు చెబుతున్నాయి.

విస్తారంగా పండిన మిర్చి..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు మినహా అంతటా మిర్చి పంట ఈ ఏడాది విస్తారంగా పండింది. దిగుబడి బాగానే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఇదేవిధంగా ప్రకాశం, కర్నూలు, కర్నాటక, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోనూ మిర్చి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు జరిగింది. ఈ కారణంగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న సరుకు బయటకు వెళ్లకుండానే నవంబరు నుంచే రాయలసీమ జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి నుంచి మిర్చి సరుకు గుంటూరు మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చారు. కేవలం కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వవున్న సరుకు విక్రయం జరగాల్సిన నవంబరు, డిసెంబరు నెలల్లో కొత్త సరుకు రావడంవలన స్టోరేజ్‌లలో సరుకు అలానే ఉండిపోయింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 81 కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండగా వాటిల్లో 71 మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో చాలా గిడ్డంగుల నిల్వ సామర్థ్యం లక్ష టిక్కీలుగా ఉన్నది. కొన్ని మాత్రం 40 వేల నుంచి 60 వేల మధ్యన ఉన్నాయి.

ధర తగ్గుదల ప్రారంభం

కాగా జనవరిలో సంక్రాంతి పండగ అయిపోగానే ఉమ్మడి గుంటూరుజిల్లా నుంచి రైతులు సరుకు తీసుకురావడం ప్రారంభిం చారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ట్రేడింగ్ జరిగేంత డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గడం ప్రారంభమైంది. మిర్చి తాలు కాయలకు తొలుత క్వింటాల్‌కు రూ.9 వేల ధర లభించింది. ఇప్పుడు రూ.7 వేలు మాత్రమే లభిస్తోంది. దీంతో రూ.9 వేల ధర మీద కొనుగోలు చేసిన వారు ఆ సరుకుని కోల్డ్ స్టోరేజ్‌లో పెడుతున్నారు. మరోవైపు మీడియం క్వాలిటీ రకాలైన 334, నెంబరు. 5, 273, 341, 4884, సూపర్ 10, ఆర్మూరు వంటి రకాలకు పెద్దగా డిమాండ్ లేదు. రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ.12 వేల ధర మాత్రమే ఎగుమతిదారులు ఆఫర్ చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో రూ.25 వేల వరకు ఉన్న తేజ, బ్యాడిగి వంటి మేలిమి రకాలు కూడా ఇప్పుడు రూ.18 వేలకు దిగి వచ్చాయి. ఈ ధర మీద విక్రయిస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావు.

రుణాలు చెల్లించలేక..

మార్కెట్‌లో మాంద్యం నెలకొన్న దృష్ట్యా రైతులు కోల్డ్ స్టోరేజ్‌ల వైపు చూస్తున్నారు. టిక్కీకి రూ.210, అక్కడికి రవాణ, దిగుమతి ఛార్జీలు అదనం అయినప్పటికీ శీతలగిడ్డంగికి తరలించి నిల్వ చేస్తున్నారు. కాగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన టిక్కీలకు చాలామంది రైతులు సహకార బ్యాంకులనుంచి రుణాలు తీసుకున్నారు. ఆరుణం చెల్లించలేకపోతున్నారు. దీంతో వారికి కొత్త రుణాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్తిపాడు పరిసరాలు, పల్నాడు, ఖమ్మం, వరంగల్ మార్కెట్‌ల పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ధర పెరగకపోతే మరో 20 రోజుల నుంచి నెల వ్యవధిలోనే శీతల గిడ్డంగులు నిండిపోతాయని వాటి యజమానులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో రైతులు తప్పక సరుకుని విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైతుంది. దాంతో ధర మరింత పతనమయ్యే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మిర్చి ధర పడిపోకుండా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



నరసింహారావు(ఫైల్)

రాజుపాలెం,మార్చి7:పెట్టుబడి నిమిత్తం తీసుకున్న అప్పులు ఎక్కువై కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మొక్కపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాన్నబాల నరసింహారావు(38) పదేళ్ల నుంచి 12 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో దిగుబడి తక్కువగా వచ్చి రైతుల వద్ద పెట్టుబడి నిమిత్తం తీసుకున్న సుమారు రూ.60లక్షలకు వడ్డీ ఎక్కువైంది. అసలు, వడ్డీ ఎలాతీర్చాలో తెలియక మనస్తాపనకు గురై గురువారం తెల్లజామున తను సాగుచేస్తున్న పొలం వెళ్లి పురుగుల మందు తాగి బంధువులకు ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడు. కుటుంబసభ్యులు వెంటనే పొలం వెళ్లి చూశారు. నోటి నుంచి నురగరావటం గమనించి వెంటనే చికిత్స నిమిత్తం సత్తైనపల్లి తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయి వివరాలు తెలియజేస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్

457కిలోల గంజాయి పట్టివేత

బాపట్ల, మార్చి 7: బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని హైవేబైపాస్ మీదుగా కంటైనర్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గురువారం తెల్లవారుజామునసెబ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా సెబ్‌అధికారి జి.నరసింహారావు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఓ కంటైనర్‌లో 17బస్తాలలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనానికి పైలెట్‌గా వెళుతున్న కారును అదుపులోకి తీసుకొని కంటైనర్‌లో ఉన్న 17బస్తాలలోని 457కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీని విలువ రూ.25లక్షలు ఉంటుందని జిల్లా సెబ్ అధికారి నరసింహారావు తెలిపారు. కంటైనర్ రాజమండ్రి నుంచి మచిలీపట్నం, రేపల్లె మీదుగా చెన్నై వెళుతున్నట్లు గుర్తించామన్నారు. వాహనంలోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా అందులో ఇద్దరు రాజమండ్రికి చెందినవారు కాగా ఒకరు చెన్నైకి చెందినవ్యక్తి అని తెలిపారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న తులసీ యోగీష్ తదితరులు

తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో
పోలీస్ సిబ్బందికి భోజన సదుపాయాలు

గుంటూరు, మార్చి7: మహాశివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండకు వచ్చే భక్తులకు భద్రత పర్యవేక్షించే స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, పోలీసులకు తులసీ సీడ్స్ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా తులసీ గ్రూపు మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్ గురువారం భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగీష్ మాట్లాడుతూ 13 ఏళ్ళుగా భక్తులసేవ, సహాయ కార్యక్రమాల నిమిత్తం కోటప్పకొండ తిరునాళ్ళ భద్రతకు విచ్చేసే పోలీస్ సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మహాశివరాత్రికి రెండు రోజుల ముందు నుంచి వరుసగా మూడు రోజుల పాటు ఈ సదుపాయాలు వారికి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. శిబిరంలో 500 మంది స్కౌట్స్, గైడ్స్ సిబ్బందికి, మరో 3 వేల మంది పోలీస్ సిబ్బందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పీ.శ్రీనివాసరావు, క్యాంపు కన్వీనర్ రాంబాబు, ఆఫీసర్ టీ.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వీపీ హరనాథ్, ఎం.కృష్ణయ్య, షేక్ దావూద్ పాల్గొన్నారు.

డీఎస్పీకి జనసేన నేతల ఫిర్యాదు

మంగళగిరి, మార్చి 7: జనసేన పార్టీ కార్యాలయ సిబ్బంది నివాసాల్లో పోలీ సులు ఆకస్మిక సోదాలు నిర్వహించిన ఘటనపై జనసేన పార్టీ నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులు గురువారం రాత్రి గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ రవి కాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. లీగల్‌సెల్ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ బుధవారం రాత్రి మంగళగిరి పట్టణ సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు మరికొందరు సివిల్‌డ్రెస్‌లో జనసేన సిబ్బంది నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు వచ్చారని, గేటుతీయడం ఆలస్యం కావడంతో వాచ్‌మెన్ కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీతోపాటు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీ రావు, చేనేత వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

10న మేదరమెట్లలో సీఎం సభకు ఆర్టీసీ క్యూ..

● ఉమ్మడి జిల్లా నుంచి 601 బస్సులు సిద్ధం ● డిపోల్లో సగం బస్సులన్నీ సభకే
● ఇక ప్రయాణీకులకు చుక్కలే..

గుంటూరు, మార్చి 7:ప్రయాణీకుల నుంచి నిరసనలు, విమర్శలు ఎన్ని ఎదురైనా ఆర్టీసీ యాజమాన్యం అధికార వైసీపీ సేవలో తరిస్తోంది. మేదరమెట్లలో ఈనెల 10న అధికార వైసీపీ తలపెట్టిన సిద్ధం సభకు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ సర్వీసులు పెద్ద ఎత్తున తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు-1,2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 193, పల్నాడులోని మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తైనపల్లి, పిడుగురాళ్ళ డిపోల నుంచి 264, బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి డిపోల నుంచి 144 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నారు. సభ 10న అయినప్పటికీ ముందురోజు ఉదయం నుంచే బస్సులను కేటాయించిన ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రెండు రోజులు ప్రయాణీకులకు చుక్కలే....

ఆదివారం మేదరమెట్లలో సభ కావటంతో ముందు రోజు నుంచే కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను తరలించాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులు కేటాయించటంతో ప్రయాణీకులకు బస్సులు అందుబాటులో లేక చుక్కలు కనిపించనున్నాయి.

మంగళగిరి డిపో నుంచి పల్లెవెలుగు సర్వీసులన్నీ సీఎం సభకే..

సీఎం సభ కోసం డిపోల వారీగా ఇప్పటికే అధికారులు బస్సులను కేటాయించారు. గుంటూరు-1 డిపో నుంచి 64, గుంటూరు-2 నుంచి 44, తెనాలి నుంచి 40, పొన్నూరు నుంచి 22, మంగళగిరి నుంచి 23 బస్సులను కేటాయించారు. కాగా మంగళగిరి డిపోలో అసలు పల్లెవెలుగు సర్వీసులుండే 24 కాగా 23 సర్వీసులను కేటాయించారు. అంటే ఒక పల్లెవెలుగు సర్వీసు మాత్రమే అందుబాటులో ఉంచనున్నారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థులకోసం అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 రిజిస్ట్రేషన్ ప్రక్రి యని ప్రారంభించినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీరులు వివిధ కేటిగిరీల రిక్రూట్‌మెంట్ కోసం joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వచ్చని సూచించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్ / స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అప్పుల ఆంధ్రాగా మార్చిన ఘనత జగన్‌దే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్,మార్చి 7: అక్షర క్రమంలో అభివృద్ధిలో ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండే ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మళ్ళీ గెలవటం సాధ్యం కాదన్న విషయం ఇప్పటికే జగన్‌కు అర్థమైందని, అందుకే దొంగ బిల్లులను డ్రా చేసుకొనేందుకు సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవటమేకాకుండా తాకట్టుపెడితేతప్పేంటని? సమర్థించుకోవటం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. గ్రాఫిక్స్ భవనాలకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయా? అని ఆయన ప్రశ్నించారు. అప్పులు తెచ్చి అభివృద్ధి కాకుండా సొంత జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ ఎంత దొరికితే అంత అప్పు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల నెత్తిన ఒక్కొక్కరిపై రూ.2.04 లక్షల భారం మోపారన్నారు. అమరావతిలో మేం భవనాలు కడితే వాటిపై అప్పులు తెచ్చుకున్న జగన్ విశాఖలో నిజమైన గ్రాఫిక్స్ చూయించారని ప్రత్తిపాటి మండి పడ్డారు. వైజాగ్ అభివృద్ధి అంటూ చూపిన గ్రాఫిక్స్ రెండు కోడికత్తులను తిరగవేస్తే ఎలా ఉంటుందో అలానే ఉందన్నారు. మింగ మెతుకు లేదు గాని పిన్నమ్మకు గాజులు చేయిస్తానన్నట్టూ విశాఖలో ఐకానిక్ బిల్డింగ్స్ కడతానని బడాయి మాటలు చెపుతున్నారని విమర్శించారు.



మందడం ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్నరైతులు

అమరావతిపై వైసీపీ పాలకులకు అక్కసు

● 1542వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి7: అమరావతిని నాశనం చేయాలనుకోవటం పెద్ద తప్పిదమని రాజధాని కోసం 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1542వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలన్నారు. ప్రజా రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకోవటం మంచిది కాదన్నారు. మూడు పంటలు పండిస్తూ సాగు చేసుకునే భూమిని ప్రభుత్వం అడిగితే రాజధాని కోసం త్యాగం చేశామన్నారు. ఒక్క రూపాయి కూడా ఆశించలేదన్నారు. ఐదేళ్ల నుంచి మూడు రాజధానులంటూ రైతులను మానసిక క్షోభకు జగన్‌రెడ్డి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయికి వచ్చి ఎవరెవరు భూములిచ్చారో తె లుసుకోవాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



దైవ సందేశమందిస్తున్న విచారణ గురువులు జోసఫ్

సాగరమాత ఉత్సవాలు ప్రారంభం

విజయపురిసౌత్, మార్చి 7: మండలంలోని విజయపురిసౌత్‌లో వేంచేసిన సాగరమాత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని గోరంట్ల విచారణ గురువులు గోపు జోసఫ్ ప్రార్థించారు. సాగరమాతను భక్తితో ప్రార్థిస్తే పాపాలు తొలగిపోతాయన్నారు. ఆలయాన్ని, జపమాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముందుగా సాగరమాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్‌బాలసాగర్, జోసఫ్ తంబి దివ్యబలిపూజలను నిర్వహించారు. గురుశ్రీ అల్లం చినశౌరైడ్డి దివ్యబలిపూజ, వాక్య పరిచర్య చేశారు. రాత్రి తేరు ప్రదిక్షణ గావించారు. సంసోను-డెలీల బుర్రకథ, రక్తబలి బైబిల్‌నాటకం ప్రదర్శించారు.

పీజీ పరీక్షలు వాయిదా

పెదకాకాని, మార్చి7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.

1,44,649 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,293 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,44,649 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 89,789 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19000
273	12300	15500
341	10000	19000
4884	11000	18500
సూపర్ 10	12500	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	10000	19000
తెల్లకాయలు	5000	12000



బీసీ డిక్లరేషన్ ఆవిష్కరిస్తున్న నసీర్, బీసీ నేతలు

బలహీనవర్గాలకు అండ బీసీ డిక్లరేషన్

● టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బలహీనవర్గాలకు ఎంతో అండగా వుంటుందని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. పార్టీ తూర్పు కార్యాలయంలో బీసీ డిక్లరేషన్ పోస్టరను బీసీ నేతలతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా టీడీపీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, దీని ద్వారా బీసీలపై టీడీపీకి వున్న చిత్తశుద్ధిని చంద్రబాబు తెలియజేశారన్నారు. పవన్ కల్యాణ్ కూడా బీసీలకు తోడుగా నిలిచారన్నారు. బీసీలపై దాడులు, అకృత్యాలను నివారించేందుకు రక్షణచట్టాన్ని తేవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆంజనేయ ప్రసాద్, బత్తిన శంకర్, సురే శ్రీనివాస్, గొడుగు శంకర్, తాడిబోయిన బుజ్జి, గుడిపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు

నగర ప్రజల గొంతెండుతోంది

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆవేదన



గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవికాలం రాకుండానే నీటి కొరతతో గుంటూరు నగర ప్రజల గొంతెండిపోతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గుజ్జనగుండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏటీ అగ్రహారం, శారదా కాలనీ, శ్రీనివాసరావుపేట, ఆకులవారితోటలో ప్రజలు నీటి కొరతతో అగచాట్లు పడుతున్నారన్నారు. గడిచిన రెండు నెలలుగా కార్పొరేషన్ నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలుషిత నీటితో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతకాల్సి వస్తోందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారుల్లో స్పందన లేదన్నారు. సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకున్నా ప్రభుత్వం, అధికారుల తీరు మారకపోవడం సిగ్గు చేటని మన్నవ మండిపడ్డారు.

డిక్లరేషన్‌లో బీసీ వర్గాలన్నింటికీ సమ ప్రాధాన్యం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్‌లో అన్ని బీసీ వర్గాలకు సమప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించి మరోసారి చంద్రబాబు బీసీ బాంధవుడిగా నిలిచారని, టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన డిక్లరేషన్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బీసీల రక్షణ చట్టం, 50 ఏళ్లకే బీసీల పెన్షన్, స్థానిక సంస్థల రిజర్వేషన్ పెంపు, బీసీ సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపు బీసీల సాధికారతకు తోడ్పడతాయన్నారు.

వైసీపీకి మహిళా దినోత్సవం నిర్వహించే అర్హత లేదు

మహిళలకు ద్రోహంచేసిన వైసీపీకి మహిళా దినోత్సవం నిర్వహించే అర్హత లేదని శేషయ్య అన్నారు. బూటకపు హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లలో మహిళలకు అన్ని విధాలా అన్యాయం చేశాడన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు లెక్కలేనన్ని జరిగాయని, అయినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు.

బీసీల సాధికారతే టీడీపీ లక్ష్యం

● టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేతలు

● చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీసీల సాధికారతే టీడీపీ లక్ష్యమని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బీసీ నేతలు అన్నారు. టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను హర్షిస్తూ పశ్చిమ కార్యాలయంలో టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర పిలుపు మేరకు టీడీపీ శ్రేణులు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు బీసీ నేతలు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అమలు చేయడమే కాక, రూ. 4వేల వరకూ పింఛన్ పెంపుదల చేయటం, దాడులు, దౌర్జన్యాలు నుంచి రక్షణ కల్పిస్తూ ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం హర్షణీయమన్నారు. అద్భుతమైన పథకాలతో బీసీ సమగ్రాభివృద్ధికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప్పుటూరి పేరయ్య, చంద్రగిరి బాబు, ఆడకా శ్రీను, తాళ్ల వెంకటేష్ యాదవ్, లాల్ వజీర్, బత్తుల జాన్ సైదా, రాళ్లబండి రామరాజు, యర్రాకుల శ్రీను, కలిచేటి హనుమంతరావు, కొమ్మూరి శ్రీధర్, పిన్నబోయిన సాంబశివరావు, నాగూర్, శ్రీను, షహీద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్

ఏ విషయంలోనూ లింగ భేదం చూపొద్దు



మహిళ దినోత్సవంలో పాల్గొన్న డీఆర్ఎం, ఇతర అధికారులు

● గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ

● రైల్‌వికాస్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

● వివిధ ప్రాంతాల్లో మహిళల వేడుకలు

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆడ, మగ అన్న వ్యత్యాసాన్ని ఏ విషయంలోనూ చూపించొద్దని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 2024 కార్యక్రమాన్ని గురువారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రైల్వే మహిళా ఉద్యోగులకు క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ.. నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆడపిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) జేవీ అనూష మాట్లాడుతూ మహిళలు తమ శక్తి, సామర్థ్యాలను మానవ సేవలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఎం దినేష్ కుమార్, సీనియర్ డీఎంఈ హర్ష, సీనియర్ డీఎస్‌వో విజయ కీర్తి, డీఎస్‌సీ హర్షప్రసాద్, మహిళసంక్షేమసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు(విద్య): మహిళలకు స్ఫూర్తి ప్రదాతలుగా తొలుత తల్లి,తరువాతగురువులేనని వినియోగ వస్తువుల తయారీ సంస్థ డైరెక్టర్ ఎం.దివ్యభారతి తెలిపారు. ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరుకాగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో... స్థానిక చౌడవరంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేల్స్‌ఫోర్స్ సంస్థలో ఇంటర్నషిప్ పూర్తిచేసిన విద్యార్థినుల్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకరరెడ్డి, ప్రిన్సిపాల్ బీఎస్‌బీరెడ్డి, ఉపాధికల్పనాధికారి డాక్టర్ మాధవరావు అభినందించారు.

హిందూ ఫార్మసీ కళాశాలలో .. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి క్రీడల్లో విజయం సాధించిన మహిళలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కే.విజయలక్ష్మీ హాజరుకాగా కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు, జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధుసూధనరావు, గౌరవ ఛైర్మన్ డాక్టర్ మన్నవ రాధకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గుంటూరు సిటీ : గుంటూరులోని కృషిభవన్‌లో వ్యవసాయ అధికారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ డీ.ప్రమీల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం మహిళా కార్యదర్శి కే.అమల కుమారి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎడిషన్ డైరెక్టర్ డాక్టర్ డీ.ప్రమీల, కమిషనరేట్ జేడీఏలు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విద్యుద్దీప కాంతులతో అమరావతి రోడ్డులోని శివాలయం

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు

● విద్యుద్దీపకాంతులతో అలంకరణలు

గుంటూరు, మార్చి 7: మహా శివరాత్రికి నగరంలో శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు విద్యుద్దీపాల కాంతులతో నూతన శోభను తీసుకొచ్చారు. నగరంలోని ప్రముఖ శివాలయాలైన పాతగుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, కొత్తపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంతో పాటు సంపత్‌నగర్, బ్రాడీపేట, అరండల్‌పేట, పట్టాభిపురం, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో శివాలయాలు విద్యుద్దీప కాంతులతో వెలుగొందుతున్నాయి. భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు, తాగునీరు వంటి వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయాల నిర్వాహకులు, అధికారులు తెలిపారు. అలానే మహా శివ రాత్రి పురస్కరించుకొని చుట్టుగుంట శ్రీపోలేరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రాత్రి ప్రత్యేకఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగులకు అందని పెన్షన్

గుంటూరు(తూర్పు), మార్చి7: ఏడో తేదీ వచ్చినా నేటికీ జిల్లాలో విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్స్ అందలేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ సయ్యద్ చాంద్‌బాష ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల 1వ తేదిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నేతలు నాగేశ్వరరావు మురళి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో పెరిగిన దాడులు

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, మైనార్టీలు, బీసీలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల సుశీలరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎస్సీ సెల్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. సుశీలరావు మాట్లాడుతూ కర్నూలులో వైసీపీ నేత పురుషోత్తంరెడ్డి ఒక దళిత మహిళ చీరలాగి, తలపైకొట్టి గాయపరడం దుర్మార్గమన్నారు. అలాంటి వారిని వైసీపీ ప్రభుత్వం ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. గుడిమెట్ల దయారత్నం మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి తిరిగి దళితులను అణచివేసే పనులే చేస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో దళిత, మైనార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

●బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ జే.పూర్ణచంద్రరావు

గుంటూరు(తూర్పు), మార్చి7: రాజ్యాధికారంతోనే బహుజనుల అభ్యున్నతి సాధ్యమవుతుందని విశ్రాంత డీజీపీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కన్వీనర్ జే.పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం బ్రాడీపేటలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన బీసీ కులాల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను సంక్షేమ పథకాలకే పరిమితి చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మాత్రమే సీట్లు ఇస్తామని, వారిని గెలిపించేలా కృషి చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, సమావేశ సమన్వయకర్త చిరతనగండ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

గుంటూరు(విద్య),మార్చి 7: ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థినులకు శానిటరీ పాడ్స్‌ను పంపిణీ చేశారు. ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ, రష్యాలోని వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు శానిటరి ప్యాడ్స్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, సోషల్ మీడియా నుంచి కలిగే దుష్ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు యశ్వంత్, శరత్, అనిల్ కుమార్, ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒక పూట తరగతుల నిర్వహణపై హర్షం

గుంటూరు(విద్య),మార్చి 7: రంజాన్ నెల సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉర్దూ విద్యాసంస్థల్లో ఒకపూట తరగతులను నిర్వహించడంపై మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ గుంటూరుజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఇషాక్, షబ్బీర్ అహ్మద్‌లు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు పాఠశాల విద్యాశాఖ ఉర్దూ డైట్ కళాశాలలు, ఉర్దూ మీడియం పాఠశాలలు ఉదయం ఒకపూట మాత్రమే తరగతులను నిర్వహించాలని నిర్ణయించడం ఎంతో అభినందనీయమని వారు అన్నారు.

సామాజిక మాధ్యమాలకు బానిసలుగా యువత

● 16న ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు శిక్షణ

గుంటూరు(విద్య),మార్చి7: సామాజిక మాధ్యమాలు విద్యార్థులు, యువతకు ఒక వ్యసనంగా మారి, వాటికి బానిసలుగా మారుతున్నారని, వీటిని నియంత్రించడానికి అవసరమైన మార్గాల అన్వేషణ కోసం ఈనెల 16న ఏఎల్ బీఈడీ కళాశాలలో వర్కుషాపు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఏస్తేరు తెలిపారు. గురువారం లాడ్జిసెంటర్‌లోని కళాశాలలో ఈ అంశంపై సమావేశంపై నిర్వహించి పోస్టరును ఆవిష్కరించారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో వర్కుషాపు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు హాజరుకావచ్చని అన్నారు. వర్కు షాపులో ప్రముఖ మానసిక వైద్యులు పలువురు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశంలో వర్కుషాపు నిర్వహకులు డాక్టర్ ఏ ఇన్నారెడ్డి, వీ.శేఖర్, కిషోర్, డాక్టర్ ఏఎస్ వెస్లీ పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● డీఆర్‌డీవో, సీఎమ్ఎస్‌డీఎస్ డైరక్టర్ డాక్టర్ మధుమిత చక్రవర్తి



విద్యార్థినులతో డాక్టర్ మధుమిత చక్రవర్తి

గుంటూరు(విద్య),మార్చి 7: మహిళలు అవకాశాలకోసం ఎవరికోసమో ఎదురు చూడొద్దని, విజ్ఞానం, నైపుణ్యం పెంచుకుంటే స్త్రీలు అవకాశాలను అందిపుచ్చుకో వచ్చునని డీఆర్ డీవో, సీఎమ్ఎస్‌డీఎస్ డైరక్టర్ డాక్టర్మధుమిత చక్రవర్తి అన్నారు. చేబ్రోలుమండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం నిర్వహిం చిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీవో, సీఎమ్ఎస్‌డీఎస్ డైరక్టర్ డాక్టర్ మధుమిత చక్రవర్తి మాట్లాడుతూ మహిళలు జీవితంలోను, సమాజంలోని సమస్యలపై గట్టిగా పోరాడాలన్నారు. ఎప్పుడూ తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన అవినయ నాచురల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ బాలక్రిష్ణ కోడూరు మాట్లాడుతూ ఎందరో మహిళలు దేశ నాయకులుగా చరిత్ర సృష్టిస్తూ, జాతి దశను, దిశను మార్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికే ఠీవీ మన పీవీ

● బ్రాడీపేటలో పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ

● మంత్రి రజనీ, పలువురు నేతల నివాళులు



పీవీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజనీ, అప్పిరెడ్డి, మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరిధర్ తదితరులు

గుంటూరు, మార్చి 7: మన తెలుగు జాతి నేత, మాజీ ప్రధాని భారతరత్న పీవీ నరసింహారావు దేశానికే ఠీవీ లాంటివారని పలువురు నేతలు కొనియాడారు. 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అర్బన్ బ్యాంక్ డైరక్టర్ బందా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు విగ్రహాన్ని వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పలువురు నేతలు గురువారం ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, విగ్రహ దాతలు తుళ్ళూరు ప్రకాష్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

63వ వసంతంలోకి.. శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్





శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ (సీబీఎస్ఈ)

● నేడు పాఠశాలలో వార్షికోత్సవం

● హాజరుకానున్న మిజోరం గవర్నర్ డాక్టర్ కే.హరిబాబు

గుంటూరు (కార్పొరేషన్), మార్చి 7 : గుంటూరు నగరానికి నడిబొడ్డున ఉన్న లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ (ఎస్‌పీఎస్ హెచ్ఎస్)స్థాపించి 62 సంవత్సరాలు పూర్తికానున్న నేపథ్యంలో శుక్ర వారం 63వ వార్షికోత్సవ కార్యక్రమాలను పాఠశాలలో ఘనంగా నిర్వ హించనున్నారు. వేడుకలకు మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గతంలో పాఠశాలను భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, అంత ర్జాతీయ ట్రిబ్యునల్ ఫర్ ద లా ఆఫ్ ద సీ జస్టిస్ డాక్టర్ పాటిబండ్ల చంద్రశేఖరరావు, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ లతోపాటు ఎందరో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు సందర్శించారు.

విద్యార్థులను అన్నిరంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాం..

- పాటిబండ్ల విష్ణువర్థన్, పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్

శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలను 1962లో స్థాపించారు. గత ఏడాది ఆగస్టు 12వ తేదీ నాటికి 62 వసంతాలు పూర్తి చేసుకొని, 63వ వసంతంలోకి పెట్టింది. తమ పాఠశాలలోని విద్యార్థులను అన్నిరంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం సీబీఎస్ఈ డిజిటల్ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నాం. నాటి విద్యా ప్రదాత పాటిబండ్ల సీతారామయ్య అడుగుజాడల్లో నడుస్తూ అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ తదితరులు

93,275 మందికి 'చేయూత' విడుదల

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి

గుంటూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన వైఎస్ఆర్ చేయూత నాలుగవ విడత నిధుల జమ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేయూత పథకానికి అర్హత కలిగిన వారికి నాలుగో విడతలో 93,275 మందికి రూ.174.88 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. డీబీటీ ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు సహాయ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోను జీఎంసీ క్యాష్ కౌంటర్లు

● నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



గుంటూరు(కార్పొరేషన్), మార్చి 7: పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 3 వారాలు మాత్రమే ఉన్నందున పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజు ల్లోనూ జీఎంసీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురు వారం రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో టెలీకాన్ఫ రెన్స్‌లో వార్డుసచివాలయం వారీగా పన్ను బకాయిలు, మొండి బకాయిదార్ల వివరాలపై సమీక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు. సెలవు రోజులైన శుక్ర, శని, ఆదివారాల్లోను జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని140, పెద్ద పలకలూరురోడ్డులోని 106, వసంత రాయపురం మెయిన్ రోడ్డులోని 148వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు.



షాపులను సీజ్ చేస్తున్న ప్రజారోగ్య శాఖ అధికారులు

డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ లేని షాపులు సీజ్

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 7 : నగరంలో డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే ఆయా షాపులను సీజ్ చేయడంతో పాటుగా చట్టపర చర్యలు తీసుకుంటామని కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారులు గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో డీఅండ్‌వో ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపులపై దాడులు చేశారు. ఈ క్రమంలో సంగడిగుంట మెయిన్ రోడ్డులోని స్పైసీ ఫుడ్స్‌టిఫిన్స్ షాపుని సీజ్‌చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో (ఎఫ్ఏసీ) ఎస్.మధుసూదనరావు, శానిటరీ సూపర్‌వైజర్ ఏ.రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భవానిబాబు, మనోహర్‌బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తాం

● తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సహా, ఏడు నియోజకవర్గాల్లో టీడీపీని గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ తెలిపారు. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గురువారం ఆయన సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. పార్లమెంటులో గుంటూరు గళం బలంగా వినిపించాలని ఆయన చంద్రశేఖర్‌ను కోరారు.



నాకు నేనే కొత్తగా అనిపించా


సుహాస్

సుహాస్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అర్జున్ వై.కె. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన టీజర్ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'సుహాస్‌కి చాలా కీలకమైన సినిమా ఇది. కథలోని పాయింట్ అదిరిపోయింది. టీజర్ చాలా బాగుంది. తప్పకుండా హిట్ అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఫేస్ బ్లైండ్ నెస్ మీద తీస్తున్న మంచి థ్రిల్లర్ ఇది. బాగా వచ్చింది. ఇందులో నాకు నేనే కొత్తగా అనిపించాను. నిర్మాతలు మణికంఠ, ప్రసాద్ ఎంతో కష్టపడ్డారు. ఇది పక్కాగా బ్లాక్‌బస్టర్ అయ్యే సినిమా. అందులో డౌట్ లేదు' అన్నారు. ఈ కథకు సుహాస్ యాప్ట్ అని దర్శకుడు అర్జున్ తెలిపారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. హీరోయిన్లు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాధికకు విశిష్ట మహిళా పురస్కారం



సీనియర్ నటి రాధికకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాధికను సన్మానించి పురస్కారం ప్రదానం చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం తెలిపారు. మంచి నటిగానే కాకుండా నిర్మాతగా కూడా పేరు తెచ్చుకున్న రాధిక తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బుల్లి తెరపై కూడా రాణిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెదకాకాని

అన్ని రకాల ఎమోషన్స్‌తో...



యూత్‌ఫుల్ చిత్రాల నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జంతో కలసి రూపొందిస్తున్న చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా ఇది. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ "దర్శకుడిని కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ చిత్రంతో తీరుతోంది. ఇది అందరూ అనుకున్నట్లు కేవలం ఎంటర్టైనర్ మాత్రమే కాదు.. అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి" అని అన్నారు.














సభలో పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిద్దాం

● డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మార్చి 7: టీడీపీ, జనసేన శ్రేణులందరం కలిసికట్టుగా ముందుకు నడిచి, రానున్న ఎన్నికల్లో ఇరుపార్టీల అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని గుంటూరు పార్లమెంటరీ నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని పెదరావూరులో టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను గ్రామపార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న అరాచకపాలనను అడ్డుకట్టవేసేందుకే ఇరుపార్టీలు ఏకమయ్యాయన్నారు. మంచి ఆశయంతో ముందుకు సాగుతున్న ఇరుపార్టీల అభ్యర్థులను గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. వైసీపీ సోషల్ మీడియా వేదికగా ఇరుపార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని అటువంటివి నమ్మవద్దనారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి అనే పథం రాష్ట్రానికి ఆమడ దూరంలో ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పెదరావూరులో పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీకి చేయకుండా ఉంటే పేదవాడికి రెండు సెంట్లు వంతున భూమి ఇచ్చేవారన్నారు. ఎమ్మెల్యే శివకుమార్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని ఆలపాటి స్పష్టం చేశారు. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో పెమ్మసాని చంద్రశేఖర్‌ను, మనోహర్‌ను ఘనంగా సత్కరించారు.

ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

● మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట మార్చి 7: ప్రజల కోసమే ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కారుమూరు హెలెన్‌నిర్మల అన్నారు. స్థానిక చినరావూరుతోటలోని సచివాలయ ఆవరణలో గురువారం రెండో విడత ఆరోగ్య సురక్షా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు కారుపూరు హెలెన్ నిర్మల, దివి కిషోర్ కుమార్, ముద్రకోల అనురాధ, టి.వినీల్‌లు పాల్గొని జనరల్ ఓపీ 159మంది, గైనకాలజి ఓపీ 32 మందిని, ఆప్తోమెట్రీషియన్ ఓపీ 36, జనరల్ మెడిసిన్ ఓపీ 156 మందిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అంది చంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం.ఆశీర్వాదం, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జైగౌడ్ జాతీయ ఉద్యమ అధ్యక్షుడిగా కిషోర్ గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న కిషోర్

తెనాలి అర్బన్, మార్చి 7: జైగౌడ్ జాతీయ ఉద్యమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా చిట్టిబొమ్ము కిషోర్ గౌడ్ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు వి.రామారావుగౌడ్ నుంచి గురువారం నియామకపత్రం అందుకున్నారు. రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఆయన కృషి చేస్తానన్నారు. అన్ని జిల్లాల్లో జైగౌడ్ ఉద్యమ సంస్థను బలోపేతం చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి మరోమారు ఏకగ్రీవంగా ఉన్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవికి ఎంపికైన ఆయనను పలువురు గౌడ సంఘస్థులు అభినందించారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట మార్చి 7: పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, క్రొత్తపల్లి రమేష్, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెల్లంకి సాంబయ్య అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధి కోసమే డీవీసీ ఇండోర్ స్టేడియం

● స్టేడియంలో పూర్తిస్థాయి వసతుల కల్పనకు ప్రాధాన్యం

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్


డీవీసీ ఇండోర్ స్టేడియంలో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మార్చి 7: పొన్నూరు పరిసర ప్రాంతాలో క్రీడల అభివృద్ధి కోసం డీవీసీ ఇండోర్ స్టేడియంను నిర్మించిన్నట్లు మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ స్టేడియం గ్రౌండ్‌లో వాకర్స్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నరేంద్ర కుమార్ నిర్వహించారు. స్టేడియం గ్రౌండ్‌లో స్థానికులతో కలిసి వాకింగ్ చేస్తూ స్టేడియంలో ఎదురవుతున్న సమస్యలు అడిగితెలుసుకున్నారు. స్టేడియం అభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు, వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతంలో క్రీడలకు శాశ్వత వనరు ఉండాలని స్టేడియంను ఏర్పాటు చేసిన్నట్లు చెప్పారు. స్కూల్ కమిటీతో పాటు స్టేడియం కమిటీని ఏర్పాటుచేసి స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అప్పటి ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి నిధులతో నిర్మాణ పనులను పూర్తిచేసినట్లు చెప్పారు. స్టేడియంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేసి పర్యవేక్షణ సిబ్బందిని నియమించామన్నారు. షెటిల్ కోర్టులు, అధునాతన జిమ్‌ను ఏర్పాటుచేసి కోచ్‌ను నియమించామన్నారు. ఐతే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టేడియం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రానున్న రోజులలో స్టేడియంను మరింత ఆధునికీకరించి కావలసని మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. పట్టణ వాసులు కూడా పొన్నూరు ప్రగతి కోసం టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలవాలని నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



గురువారం తెనాలిలో జరిగిన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు చేపట్టిన తెలుగు జనచైతన్య పాదయాత్రకు పూలజల్లులతో ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు - తెనాలి

టీడీపీ, జనసేన కూటమితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

● ధూళిపాళ్ళ నరేంద్రకుమార్


శేకూరుపాలెంలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పొన్నూరు 20వ వార్డులో వైదీప్తిల ప్రచారం

చేబ్రోలు, మార్చి7: టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని శేకూరు పాలెంలో గురువారం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ టీడీపీ మ్యానిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ, భవిష్యతుకు గ్యారంటీ పేరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన నరేంద్ర కుమార్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల మాటున వైసీపీ ప్రభుత్వం అరాచకాలు సృష్టించిందని ఆరోపించారు. అన్నిరంగాల ప్రజలు వైసీపీ దోపిడీ పాలనకు గురయ్యారని ఆరోపించారు. ఖనిజ సంపదను గ్రావెల్ వంటి ప్రకృత్తి సంపదను వైసీపీ పాలకులు యధేచ్ఛగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. చేబ్రోలు మండలంలో శేకూరు, వీరనాయకుని పాలెం వంటి గ్రామాలో 700 ఎకరాల పండ్ల తోటలను ధ్వంసం చేసి గ్రావెల్ మాఫియా వైసీపీ పెద్దల కనుసన్నలలో కోట్లాది రూపాయలను దోచుకుందని దుయ్యబట్టారు. ఈ దోపిడీపై అనేకసార్లు కలెక్టర్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ గ్రావెల్ మాఫియా ఆగడాలపై రానున్న ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరిపి నిధితులను శిక్షించటంతోపాటు, బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఈ అరాచకాలకు ముగింపు పలకాలంటే ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలిచి గెలిపించాలని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి కోసం టీడీపీ, జనసేనకు అండగా నిలవాలి: వైదీప్తి

పొన్నూరు టౌన్, మార్చి 7: పొన్నూరు ప్రగతి కోసం రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వైదీప్తి భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను వార్డులో ఇంటింటికి వెళ్లి పంచిపెట్టారు. జెండా చెట్టు వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. వార్డుల్లో వైదీప్తికి స్థానికులు ఎదురేగి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలు వైదీప్తి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన అధినేతలు ఒకటయ్యారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అన్ని రంగాలో అభివృద్ధి సంక్షేమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ దగ్ధంపై అగ్నిమాపక శాఖ నివేదిక ఇవ్వాలి

పసుపు రైతుల సంఘం నాయకుడు శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, మార్చి 7: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి పంటలు దెబ్బతిన్న ఘటనకు సంబంధించిన అగ్నిమాపకశాఖ నివేదికను తమకు ఇప్పించాలని పసుపు రైతు సంఘం నాయకులు అగ్నిమాపక శాఖ అధికారుల కోరారు. గురువారం అగ్రిమాపక శాఖ కార్యాలయానికి రైతుసంఘ నాయకులతో కలిసి ములకా శివసాంబిరెడ్డి వెళ్లి నివేదికను అందించాలని వినతిపత్రం అందించారు. అనంతరం అగ్నిప్రమాద పసుపు రైతుల కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, పోరాట కమిటీ సభ్యులు నాదెళ్ల చంద్రశేఖర్‌లు విలేకరులతో మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగి 49రోజులు గడిచినప్పటికీ దుర్ఘటనకు సంబంధించిన నివేదిక వెలువడక పోవడంతో రైతుల్లో ఆందోళన పెరుగుతుందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి రూ.115 కోట్లు విలువజేసే పసుపు పంటను బూడిదగా మారడానికి ప్రధాన బాధ్యుడైన కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం మానవత్వం మరిచి రైతులతో ప్రభుత్వమే నష్టం ఇస్తుందని ఎద్దేవాగా మాట్లాడటాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతుల ఆందోళనకు మరింత కారకుడుగా మాట్లాడిన యాజజమాన్యంపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి

● న్యాయాధికారి శ్రీసీత

తెనాలి క్రైం, మార్చి 7: మహిళలు ధైర్యంగా ముందడుగు వేసిన రోజు అన్ని రంగాల్లోను తమ ప్రజ్ఞను చాటుకోగలుగుతారని 2వ అదనపు జ్యూడిషయల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెదరావూరులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమాన పాత్ర పోషించాలని దీనికి కావాల్సిన ప్రజ్ఞనను వారు పెంపొందించుకోవాలన్నారు. దురదృష్టవశాత్తు మహిళలు తాము పని చేస్తున్న ప్రదేశాల్లో వివక్షకు గురవుతున్నారని తప్పని పరిస్థితుల్లో ఆవేదనను అనుచుకుంటూ ఆ పనులు కొనసాగిస్తున్నారని, గృహాల్లో కూడా వివక్షతకు గురవుతున్నారని మహిళలకు అన్యాయం జరిగినప్పుడు న్యాయస్థానాల్లో గాని, పోలీస్ స్టేషన్‌లోగాని ఫిర్యాదుచేసి న్యాయం పొందాలన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థలో మహిళలకు ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మహిళలు చైతన్య వంతులు కావాలని మహిళలకు కల్పించే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, కార్యదర్శి సుబ్బారావు, న్యాయసేవాధికార సిబ్బంది మాబూ, సరళ, యర్రంశెటి అనీల్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు

తెనాలి అర్బన్, మార్చి 7: పురుషులతో పాటు సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ చెప్పారు. కళాశాలలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అధ్యాపకులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలను ఘనంగా సన్మానించారు. ఫణికృష్ణ, భార్గవి తదితరులు పాల్గొన్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో విశ్రాంత వీపీ సూర్యదేవర సుగుణకుమారిని సన్మానించారు. నన్నపనేని సుధాకర్, సుగుణ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు. జేఎంజే మహిళా కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. స్త్రీ సంక్షేమం - స్వావలంబన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర సచివాలయంలో పని చేస్తున్న అరుణదీప్తిని సన్మానించారు. కరస్పాండెంట్ థెరిసమ్మ, ప్రిన్సిపాల్ షైనీ, సరోజిని, యోజిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.


విజేతను సన్మానిస్తున్న మహిళా అధ్యాపకులు

● చేబ్రోలు: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలో రణిస్తున్నారన్ని విజ్ఞాన్ యూనివర్సిటి ఇంటర్నేషనల్ అఫైర్స్ డీం డాక్టర్ శారద అన్నారు. గురువారం సంగం డెయిరీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డెయిరీలో పనిచేసే వివిధ విభాగాల మహిళా సిబ్బందికి పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

తెనాలి, మారీసుపేట మార్చి 07: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రైల్వేస్టేషన్ వంతెన వద్ద గల సాయిబాబా గుడి వద్ద ఈమని గ్రామ నివాసి బొళ్ళ శివరామకృష్ణ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 11 బాటిల్స్‌ను స్వాధీనం చెసుకున్నామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా రామేశ్వరస్వామికి వాహన సేవలు

తెనాలి అర్బన్, మార్చి 7: గంగానమ్మపేటలోని పాత శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగం గా గురువారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపర్వత వర్ధని సమేత రామేశ్వరస్వామికి మయూర వాహన సేవ, గజవాహన సేవలు నిర్వహించారు. ఈవో రమణకుమారి, అర్చకులు టీవీ సురేష్, ధర్మకర్తలు సుబ్రహ్మణ్యం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కొల్లిపర, మార్చి 7: మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యంద్రపాటి నిఖిల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్ స్కేల్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల శ్రమను మరచిపోకుండా చక్కగా చదువుకుని వారికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి నిఖిల్ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజకుమారి, సత్యసుహాసిని, భూపతినాయుడు, కె. ప్రశాంత్, వి.ఫణి, డి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురంను దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, మార్చి 7: వైకుంఠపురం ఆలయాన్ని భక్తులు ఆశించిన విధంగా దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన గోశాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆలయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, దాతలు, భక్తుల సాయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొంతకాలంపాటు పనులు జరగడం వల్ల భక్తులకు ఒకింత అసౌకర్యం కలుగుతుందని పనులన్నీ పూర్తయితే ఈ ప్రాంతం ఓ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. ఈవో తిమ్మానాయుడు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ సాయిబాబు, సభ్యులు సందీప్, జగదీశ్వరి, సునీత, రవిశంకర్, సరస్వతి, నాగేశ్వరరావు, ప్రసాద్, దుర్గారావు, ఆశహరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబార్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సునీత శంకర్, పక్కన డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు

పెదకాకాని, మార్చి 7: తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా విజయవాడ డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ సుమితాశంకర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమిత శంకర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల భాగస్వామ్యం బాగా పెరిగిందన్నారు. పురోగతిలో వారి భాగస్వామ్యాన్ని ఆమె వివరించారు. మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. సమాజ శ్రేయస్సుకు మహిళలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్యరంగాల్లో మహిళల పురోగతిని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో భారతీయ దంత వైద్య మండల సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, ఓరల్ మెడిసిన్ విభాగాధిపతి వై.సమత, ఆర్థోడిటిక్స్ విభాగాధిపతి ఎం.కళ్యాణి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాల పంపిణీ

పొన్నూరు టౌన్, మార్చి 7: పొన్నూరు పట్టణంలో 19వ వార్డు ఎస్టీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు ఎంఎం యూత్ సభ్యులు అండగా నిలిచారు. గురువారం బాధిత 9 కుటుంబాలకు బియ్యం బస్తాలు, నిత్యవసరాలను అందించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు మహ్మద్, మల్లా నసరుద్దీన్, షౌకత్, ఎంఎ మహ్మద్, ఎస్ఎం బాషా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు పట్టణంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన 9 కుటుంబాలకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కటికల రాంబాబు సతీమణి ప్రశాంతకుమారి ఒక్కో కుటుంబానికి రూ.1200 విలువ చేసే బియ్యం, నిత్యవసరాలను అందించారు. కార్యక్రమంలో కటికల చిన్నబాబు, ఇందిరాకాలనీ స్థానికులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

పొన్నూరు టౌన్, మార్చి 7: మండల పరిధిలోని మునిపల్లెలో అదృశ్యమైన బాలికను రూరల్ పోలీసులు కనుగొని తల్లికి అప్పగించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక పిరంగిపురంలో ఉన్నట్లు గుర్తించి ఎస్ఐ భార్గవ్ బాలికను రప్పించి గురువారం తల్లికి అప్పగించారు.

బహిరంగ ప్రకటన

[illegible] DOC NO: 910/2024, S.R.O. చీరాల.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.